# ఆసరాతో మహిళలకు ఆర్థిక పరిపుష్టి



సీఎం జగన్ కటౌట్‌కు క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి,చంద్రకళాదీప్తి, శివప్రసన్న, పద్మశ్రీ తదితరులు

- ఎంపీ వంగా గీత
- ఘనంగా ఆసరా సంబరాలు
- పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: మహిళాభివృద్ధి, సంక్షేమానికి సీఎం జగన్ ఎన్నో పథకాలు, సంస్కరణలు అమలు చేస్తున్నారని ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. స్థానిక సాంబమూర్తినగర్ ఐదో వీధిలోని ఇందిరాకాలనీలో వైఎస్సార్ ఆసరా సంబరాలను శుక్రవారం నిర్వహించారు. ఎంపీతో పాటు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివ ప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, అధికారులు, నాయకులు పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ అమ్మఒడి వంటి పథకాలను వ్యతిరేకిస్తున్న ప్రతిపక్షాలు వాళ్ల అధికారంలోకి వస్తే ఈ పథకాలు కొనసాగిస్తారా అని ప్రశ్నించారు. నిరంతరం ప్రజల శ్రేయస్సును ఆకాంక్షించే ముఖ్యమంత్రిని మరోసారి ఆశీర్వదించాలని ఆమె కోరారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మహిళ సంతోషంగా ఉన్నప్పుడే కుటుంబం అభివృద్ధి చెందుతుందని విశ్వసించి సీఎం జగన్ వారికి ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. ఇలాంటి సీఎంను మరోసారి గెలిపించుకుంటే మరిన్ని మెరుగైన పథకాలు అమలు చేస్తారన్నారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్నసాగర్ తదితరులు ఆసరా నిధులు విడుదల చేసిన సీఎం జగన్ చిత్రపటానికి స్వయం సహాయక సంఘాల సమక్షంలో క్షీరాభిషేకం చేశారు. నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, టీపీఆర్ఓ మానే కృష్ణమోహన్, మాజీ డిప్యూటీ మేయర్లు మీసాల ఉదయ్ కుమార్, పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



రమణయ్యపేటలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీ గీత, ఎమ్మెల్యే కురసాల తదితరులు

- ఇచ్చిన మాటకు కట్టుబడి రుణమాఫీ
- 2799 సంఘాలకు రూ.22.88 కోట్ల విడుదల
- ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: మహిళల ఆర్థిక పరిపుష్టికి ఆసరా పథకం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. ఇటీవల సీఎం జగన్ డీబీటీ ద్వారా ఆసరా మూడో విడత సొమ్ములను విడుదల చేయగా పది రోజుల పాటు ఆసరా సంబరాలు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా సర్పవరం జంక్షన్ వద్ద స్పందన ఫంక్షన్ హాలులో శుక్రవారం ఎమ్మెల్యే కురసాల అధ్యక్షతన మండల లబ్ధిదారులకు ఆసరా చెక్కు పంపిణీ చేశారు. ఎంపీ గీత ముఖ్య అతిథిగా హాజరై 2799 సంఘాల్లోని 28015 మందికి రూ.22.88కోట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.150 కోట్లు రుణ మాఫీ చేయగా, రూరల్ మండలంలో రూ.91 కోట్ల మాఫీ అవుతుందన్నారు. అత్యధికంగా తూరంగిలో మూడు కోట్లకు పైగా మాఫీ అయ్యిందన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న జగనన్నకు అండగా నిలవాలన్నారు. ఎంపీ గీత మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్ మూడు విడతల్లో వడ్డీ మాఫీ చేశారన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు దున్నా జనార్దనరావు, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, ఎంపీపీ గోపుశెట్టి పద్మజ, వివిధ కార్పొరేషన్ల డైరెక్టరు అనుసూరి ప్రభాకరరావు, గంపల రాణి, వైస్ ఎంపీపీలు బందిలి విరీష, సత్తిబాబు, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రీజనల్ కో ఆర్డినేటరు జమ్మలమడక నాగమణి, కాకినాడ మహిళా విభాగం అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, పంపన రామకృష్ణ, దడాల జాషువ గిరి, సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య పనుల పరిశీలన

కాకినాడ: నగరపాలక సంస్థ ఆదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు శుక్రవారం ఏడో డివిజన్ అయోధ్యనగర్, పళ్లం రాజునగర్ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్‌తో కలసి తనిఖీ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ప్రజలతో సమన్వయం చేసుకుని మెరుగైన పారిశుధ్య నిర్వహణ ద్వారా నగరాన్ని 'స్వచ్ఛ కాకినాడ'గా తీర్చిదిద్దాలని ఏడీసీ పిలుపునిచ్చారు.

## మోదీ పాలనతో ప్రజాస్వామ్యానికి ముప్పు

కాకినాడ: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వ పాలన ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారిందని కేంద్ర రక్షణశాఖ మాజీ సహాయ మంత్రి మల్లిపూడి మంగపతి పళ్లంరాజు పేర్కొన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం సాయంత్రం విలేకర్లతో మాట్లాడుతూ సీబీఐ, ఈడీ, ఆర్‌బీఐ, ఎలక్షన్ కమిషన్ వంటి వ్యవస్థలను గుప్పెట్లో పెట్టుకుని స్వార్థానికి వాడుకుంటుందని మండిపడ్డారు. కక్షసాధింపు చర్యల్లో భాగంగానే రాహుల్‌పై అనర్హత వేటు వేశారన్నారు. దీనిపై సుప్రీం కోర్టులో పోరాడతామని, దేశ వ్యాప్తంగా నిరసనలు కొనసాగిస్తామన్నారు.

## క్లుప్తంగా

### జాతీయస్థాయి సదస్సుకు కమిషనర్ రమేష్

కాకినాడ: కార్పొరేషన్లు, మున్సిపాలిటీల వంటి స్థానిక సంస్థల ఆర్థిక పరిపుష్టి, మౌలిక వసతుల మెరుగుదలకు తీసుకోవలసిన చర్యలపై చర్చించేందుకు విశాఖలో ఏర్పాటు చేసిన జాతీయస్థాయి సదస్సుకు నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వశాఖ పర్యవేక్షణలో శుక్రవారం సదస్సు జరిగింది.

### ఎస్ఎఫ్ఐ ప్రజ్ఞా పాటవ పోటీల్లో ఆశిత ప్రతిభ



జ్ఞాపిక గెలుచుకున్న ఆశిత

నాగమల్లితోట జంక్షన్: జిల్లా ఎస్ఎఫ్ఐ శాఖ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రజ్ఞాపాటవ పోటీలలో స్థానిక ప్రైవేట్ పాఠశాల విద్యార్థిని ఎం.ఆశిత ప్రతిభ కనబరిచి మెమెంటో సాధించింది. సుమారు మూడు వేల మంది రాసిన ఈ పరీక్షల్లో ఆశిత ప్రశంసాపత్రం, మెమెంటో అందుకుంది. ఆశితను పాఠశాల ఏజీఎం రాఘవేంద్రరావు, జోనల్ అకడమిక్ కో–ఆర్డినేటర్ సుంకరమూర్తి, ప్రిన్సిపాల్ షర్మిల, అకడమిక్ డీన్ రమణారావు, అపర్ణ శుక్రవారం అభినందించారు.

### ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

కాకినాడ సిటీ: పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ జిల్లా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమీపంలో ధర్నా, ర్యాలీ నిర్వహించారు. తుని, కోనసీమ సంఘటనల్లో పెట్టిన కేసులను ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు వల్లూరి సత్తిబాబు, నరుకుర్తి రాజు, హేమంత్, కాకాడ నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

### నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



నిత్యావసర సరుకుల పంపిణీపై సమీక్షిస్తున్న అధికారులు

కరప: నిబంధనల మేరకు చౌకధరల దుకాణాలను నిర్వహించాలని, ఎవరైనా అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పి.శ్రీనివాసరావు డీలర్లను హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన మండల రేషన్ డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంఎస్ఓ టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ డీలర్లు అందరూ తమ డిపోల లైసెన్సులు రెన్యూవల్‌కు చలానాలు ఇవ్వాలని, పంచదార, కందిపప్పు వినియోగదారులకు సక్రమంగా అందించాలన్నారు. ఈ సందర్భంగా డీలర్లు వారి సమస్యలను వివరించారు. మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు నల్లా వెంకటేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు నక్కా నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్, కార్యదర్శి కె.సాయి కుమారి తదితరులు పాల్గొన్నారు.

### కార్పొరేషన్ డ్రైవర్‌కు సత్కారం

కాకినాడ సిటీ: చేసిన సేవలే ఉద్యోగిగా గుర్తుంటాయని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ జి.భీమశంకరం అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ప్రాంగణంలోని బీసీ కార్పొరేషన్ కార్యాలయంలో కార్పొరేషన్ డ్రైవర్ తోటాడ కొండలరావు పదవీవిరమణ సందర్భంగా బీసీ కార్పొరేషన్ ఉద్యోగులు ఆయనకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీ పి.సత్యరమేష్, నెడ్‌క్యాప్ జీఎం జి సత్యనారాయణ, కార్పొరేషన్ ఏఈఓ జి.సత్యనారాయణ, విశ్రాంత ఏఈవో శ్రీధర్, కార్యాలయ సిబ్బంది కొండలరావు సేవలను ప్రశంసించారు. అనంతరం కొండలరావు, రత్నం దంపతులను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు.

### వినికిడి సమస్యపై అశ్రద్ధ తగదు

కాకినాడ రూరల్: ప్రస్తుత జీవన విధానంలో ఆధునిక సాంకేతిక పరికరాల ద్వారా వినికిడి సమస్యలు ఏర్పడుతున్నాయని, అటువంటప్పుడు వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని డాక్టర్ గుబ్బల లక్ష్మణ ప్రసాద్ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆరోగ్య అవగాహన సదస్సులో ఆయన పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

### అయ్యప్పస్వామి ఆలయంలో చోరీ

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలు అయ్యప్పస్వామి ఆలయంలో హుండీ చోరీకి గురైనట్టు ఆలయ కమిటీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం గొల్లప్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గొల్లప్రోలు ఎస్సై వినయ్‌ప్రతాప్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. రూ.25 వేల వరకు నగదు చోరీకి గురై ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

# జగనన్నే మన భవిష్యత్

- సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించండి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల
- సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రజారంజక పాలన అందిస్తున్నారని, జగనన్నే మన భవిషత్ అని కొత్తగా నియమితులైన వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. రమణయ్యపేటలో శుక్రవారం ఉయదం నేమాం, పండూరు, పి.వెంకటాపురం, తిమ్మాపురం, తమ్మవరం, పెనుమర్తి, సూర్యారావుపేట, వాకలపూడి, వలసపాకల, రమణయ్యపేట, సర్పవరం గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు 72 మంది, గృహ సారథులు 1204 మందికి, సాయంత్రం నగరంలోని రూరల్ నియోజకవర్గ అర్బన్ డివిజన్ల పరిధిలోని 48మంది కన్వీనర్లు, 620 మంది గృహ సారథులకు సుభమ్ కాపు కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ద్వారా వైఎస్సార్ సీపీ పటిష్టానికి దిశా నిర్దేశం చేశారు. వలంటీర్లతో తమ పరిధిలోని ఇళ్లకు వెళ్లి లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరించి వారితో మమేకమవ్వాలని కోరారు. హేళనకు గురైన వలంటీర్ వ్యవస్థ ద్వారానే నేడు నేరుగా పథకాలను లబ్ధిదారుల ఇళ్లకు అందిస్తూ వలంటీర్లు జవాబుదారీగా ఉన్నారన్నారు. ఈ నెల 7 నుంచి జగనన్నే మన భవిషత్ కార్యక్రమం నిర్వహించాలని, ఇందులో భాగంగా పార్టీ పరంగా అందించిన మెటీరియల్ కిట్లను పంపిణీ చేశారు. నియోజవర్గ పరిశీలకుడు దున్నా జనర్ధనరావు, కురసాల సత్యనారాయణ, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, సచివాలయాల మండల కన్వీనర్ గీసాల శ్రీను, జమ్మలమడక నాగమణి, రేఖా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో తాగునీరు, విద్యుత్‌పై అప్రమత్తం



ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలకు పట్టుబడుతున్న తిమ్మాపురం సర్పంచ్ సత్యనారాయణ

- ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: వేసవిలో తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కుసాల కన్నబాబు కోరారు. రమణయ్యపేటలోని కాకినాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గోపుశెట్టి పద్మజ అధ్యక్షతన మండల సమావేశం శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. ఎమ్మెల్యే కన్నబాబు ముఖ్య అతిథిగా హాజరై శాఖల వారీగా సమీక్షించారు. గత సమావేశంలో పేర్కొన్న విద్యుత్ సమస్యపై అధికారులు వివరణ కోరారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీదేవి, ఏఈ మారుతీరామ్‌ను కోరారు. పండూరు వాటర్ స్కీమ్‌ను అభివృద్ధి చేసేందుకు రూ.9.3 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే కన్నబాబు ప్రకటించారు. జగనన్న కాలనీలో నీటి సరఫరాకు వీలుగా ట్యాంకులు, పైప్‌లైన్ల కోసం మరో రూ.6.23కోట్లు మంజూరయ్యాయన్నారు. సర్పవరంలో వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలని అధికారులను ఆదేశించారు. తిమ్మాపురం ఉపాధి పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్ పంచాయతీ సిబ్బందికి మస్టర్లు వేసి నిధులు దుర్వినియోగం చేశారని, సోషల్ ఆడిట్‌లో అవకతవకలు బయటపడినా చర్యలు తీసుకోలేని సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ వివరించగా ఎమ్మెల్యే కన్నబాబు ఏపీఓ కొండలరావును వివరణ కోరారు. పీడీ కార్యాలయం నుంచి చర్యలు తీసుకోవల్సి ఉందన్నారు. పంచాయతీ కార్యదర్శులు జగనన్న కాలనీలలో డోర్ నంబర్లు వేయాలని ఎమ్మెల్యే సూచించారు. డీఎల్‌డీఓ నారాయణమూర్తి, ఎంపీడీఓ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ బందిలి విరీష, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# 95 శాతం పన్ను వసూళ్లు

- రూ.47.6 కోట్ల పన్నుల ఆదాయం
- గత ఏడాదికన్నా రూ.7 కోట్ల అదనం
- చివరి రోజు రూ.2.38 కోట్ల రాక



పన్నులు స్వీకరిస్తున్న డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్

కాకినాడ: ఆస్తి, ఖాళీ స్థలాలు, కుళాయి పన్నుల ద్వారా 2022–23 ఆర్థిక సంవత్సరానికి సుమారు 95 శాతం పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని సాధించగలిగారు. ఆర్థిక సంవత్సరం ముగింపు చివరి రోజైన శుక్రవారం సాయంత్రానికి రూ.47.6 కోట్లు వసూలు చేయగలిగారు. గత ఏడాది సుమారు రూ.40.8 కోట్లు వసూలు చేయగా, ఈ ఏడాది అదనంగా సుమారు మరో రూ.7 కోట్లు రాబట్టగలిగారు. నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్, అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు పర్యవేక్షణలో చేసిన కృషి సత్ఫలితాన్నిచ్చింది. మొండి బకాయిలపై ప్రభుత్వం వడ్డీ రాయితీని ప్రకటించిన నేపథ్యంలో పాతబకాయిలతోపాటు అనేక న్యాయపరమైన వివాదాల్లో ఉన్న బకాయిలను కూడా రాబట్టగలిగారు. ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను ద్వారా రూ.2.16 కోట్లు, కుళాయి పన్ను ద్వారా రూ.22 లక్షలు వెరసి 2.38 కోట్లు రాబట్టగలిగారు.

# కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న బబిత పి.కుమార్, ప్రొఫెసర్ ప్రసాద్‌రాజు తదితరులు

కాకినాడ రూరల్: ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ నిధులతో నన్నయ వర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్ డిజిటల్ క్లాస్ రూమ్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఓఎన్‌జీసీ మహిళా సమితి అధ్యక్షురాలు బబిత పి.కుమార్, వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ ఓఎన్‌జీసీ రూ.16.5 లక్షలతో ఏర్పాటుచేసిన ఈ క్లాస్ రూమ్ విద్యార్థులకు ఎంతో సహాయపడుతుందన్నారు. ఇటువంటి అభివృద్ధి కార్యక్రమానికి కృషి చేసిన క్యాంపస్ ప్రిన్సిపాల్ కమల కుమారిని, వీటికి సహకరించిన ప్రొఫెసర్ ఎస్.ప్రశాంతిశ్రీని, క్యాంపస్ అధ్యాపకులు డాక్టర్ ఎం.శ్రీరామరాజును అభినందించారు. అనంతరం ముఖ్య అతిథులకు సన్మానం చేశారు. ప్రొఫెసర్ ప్రశాంతి శ్రీ, ఓఎన్‌జీసీ జనరల్ మేనేజర్ డాక్టర్ మాలిక్, ఆర్.శంకర్, అన్వర్, లక్ష్మి సురేష్, ఓఎన్‌జీసీ అధికార బృందం, క్యాంపస్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాదయాత్ర బృందానికి సత్కారం

కాకినాడ: ఇటీవల కాకినాడ నుంచి కాశీ, అయోధ్య తదితర పుణ్యక్షేత్రాలకు మహాపాదయాత్ర చేసిన భక్త బృందాన్ని రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. 21 మంది భక్తులు 90 రోజుల పాటు పాదయాత్ర చేసి పుణ్యక్షేత్రాలను సందర్శించారు. గురు స్వామి గల్లా సుబ్బారావు, ఆధ్యాత్మిక వేత్త రవిశంకర్ పట్నాయక్, సాహిత్యవేత్త డాక్టర్ శిరీష, అడబాల రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల భూములకు పట్టాలు ఇవ్వాలి

కాకినాడ సిటీ: శంఖవరం మండలం వేళంగి పంచాయతీ పోలవరం గ్రామానికి చెందిన గిరిజనులు సాగుచేసుకుంటున్న కొండపోడు భూములకు పట్టాలు ఇచ్చి తమకు భూహక్కు కల్పించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక స్పందనకు వచ్చిన పోలవరం గిరిజనులు కలెక్టరేట్ వద్ద డిమాండ్ చేసిన సందర్భంగా సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ మాట్లాడారు. గిరిజనుల భూములకు హక్కులు దక్కే వరకు సీపీఎం పోరాటం చేస్తుందన్నారు. నాయకులు ముర్ర దొంగబ్బాయి, నూకరాజు తదితరులు ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్‌లో వినతి పత్రం అందజేశారు.

## విద్యాశాఖ సూపరింటెండెంట్‌గా ప్రకాష్



పెండెం ప్రకాష్‌కు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న డీఈవో అన్నపూర్ణ

కాకినాడ సిటీ: జిల్లా విద్యాశాఖ సూపరింటెండెంట్‌గా పెండెం ప్రకాష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన డీఈవో అన్నపూర్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో ఆయన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా విద్యాశాఖ సీనియర్ అసిస్టెంట్‌గా పని చేశారు. ప్రస్తుతం విద్యాశాఖ పదోన్నతుల కౌన్సిలింగ్‌లో కాకినాడకు సూపరింటెండెంట్‌గా బదిలీపై వచ్చారు.

## అసభ్యంగా ప్రవర్తించిన ముగ్గురికి జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మహిళలపై అసభ్యంగా ప్రవర్తించి, చంపేస్తానని బెదిరించిన ముగ్గురికి ఒక్కొక్కరికి ఆరు నెలల జైలు, రూ.6,500 చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ నాలుగో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ సీకేవీ సత్యక్రాంతికుమార్ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం యానాంకు చెందిన ఈరేళ్ల వీర వెంకట సత్యనారాయణ, ఈరేళ్ళ బేబీ ప్రశాంతి కుమారి, ఈరేళ్ళ జయరాజుకు చెదలవాడ ఉమా కుమారికి సరిహద్దు విషయంపై ఘర్షణ జరుగుతోంది. దీంతో ఉమాకుమారిని ముగ్గురు కలిసి అసభ్యంగా దూషించి, చంపేస్తానని బెదిరించారు. ఈ మేరకు ఉమా కుమారి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో ముగ్గురిపై నేరం రుజువు కావడంతో ఒక్కొక్కరికి ఆరు నెలల జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

## సారా ధ్వంసం

కాకినాడ క్రైం: జిల్లా సెబ్, పోలీస్ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో పట్టుబడ్డ నాటుసారాను సెబ్ ప్రత్యేకాధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం ధ్వంసం చేశారు. కాకినాడ రూరల్ మండలం బీచ్‌రోడ్‌లోని నేమాం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో 14,747 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేసినట్లు శ్రీనివాస్ తెలిపారు. 1557 కేసుల్లో ఈ సరకును పట్టుకున్నామన్నారు.

# సాగులో సాంకేతికతపై అవగాహన అవసరం

- జేడీఏ విజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జేడీఏ విజయ్‌కుమార్

కరప: రైతులలో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించి తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించేందుకు వ్యవసాయశాఖ సిబ్బంది పనిచేయాలని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకుడు ఎస్.విజయ్‌కుమార్ సూచించారు. భూమి సారవంతంతో పాటు, అదనపు ఆదాయాన్ని చేకూర్చే అపరాలు, పచ్చిరొట్ట పైర్లు సాగుచేసేలా రైతులను చైతన్య పరచాలన్నారు. నడకుదురులోని కరప సబ్‌డివిజన్ ఏడీఏ కార్యాలయంలో శుక్రవారం కరప, కాజులూరు, తాళ్లరేవు మండలాల వీఏఏలు, వీహెచ్ఏలు, ఎంపీఈఓలతో ఏడీఏ కె.బాబూరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన శిక్షణలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ అధికారులు, సిబ్బంది ఉద్యోగం చేస్తున్నామని కాకుండా అన్నదాతకు సేవచేసే అవకాశం లభించిందన్న దృక్పథంతో పనిచేసి, లాభసాటి వ్యవసాయానికి కృషిచేయాలన్నారు. సాగు పెట్టుబడి తగ్గేలా, మద్దతుధర లభించేలా వారికి మెళకువలు తెలియజేశారు. వేసవిలో అపరాల సాగుకు 10 వేల మినీ కిట్లు ఉచిత సరఫరాకు అందుబాటులో ఉంచామని, అపరాలు, పచ్చిరొట్ట పైరు సాగుచేయించడం, జూన్ ఒకటో తేదీన కాలువలకు సాగునీరు వదిలే సమయానికి ఖరీఫ్ విత్తనాలు సిద్ధం చేయించి, జూన్ మొదటివారంలో నారుమళ్లు వేయించి, ముందస్తుసాగుకు సమాయత్తం చేసేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేసే సంక్షేమ పథకాలను అందరికీ అందేలా రైతుల సమాచారం సేకరించి, ఈకేవైసీ చేయించాలని జేడీఏ సూచించారు. పెద్దాపురం డీఆర్‌సీ డీడీఏలు, ఏడీఏలు రైతులకు శిక్షణ ఇచ్చారు. జిల్లా వనరుల కేంద్రం (పెద్దాపురం) డీడీ బీవీఎస్‌సీ హరి, ఏడీఏ పి.మాధవి, ఏఓ (టెక్నికల్) ఎ.గాయత్రీదేవి, కరప, కాజులూరు, తాళ్లరేవు మండలాల వ్యవసాయాధికారులు ఏవీ రాజేష్, వి.అశోక్, ఎస్.ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

# లాభాల బాటలో పీఏసీఎస్‌లు



మహాజన సభలో సంఘం కార్యకలాపాలు వివరిస్తున్న ఇన్‌చార్జి సీఈఓ మంగతాయారు

కరప: రైతులకు సకాలంలో రుణ పరపతి కల్పించి, సొసైటీని లాభాల బాటలో నడిపిస్తున్నట్లు ఇన్‌చార్జి సీఈఓ చోడపునీడి మంగతాయారు తెలిపారు. స్థానిక పీఏసీఎస్‌లో శుక్రవారం నిర్వహించిన అర్ధసంవత్సర మహాసభలో ఆమె మాట్లాడారు. కరప పీఏసీఎస్ పరిధిలోని కరప, పేపకాయలపాలెం, కొరిపల్లి, పాతర్లగడ్డ గ్రామాల్లోని 1400 మంది రైతులకు ఎస్‌టీ రుణాలుగా రూ.3.5 కోట్లు, ఎల్‌టీ రుణాలు రూ.2 కోట్లు, ఎస్‌టీ ఆదర్శ రుణాలు రూ.50 లక్షలు ఇచ్చామని తెలిపారు. ఈ ఏడాది కొత్త సభ్యులకు రూ.4.05 లక్షల రుణాలు అందజేశామన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో సొసైటీకి రూ.18 లక్షలు లాభాలు వచ్చాయన్నారు. పీఏసీఎస్ ప్రత్యేకాధికారి, సహకారశాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.గణేష్‌బాబు, మాజీ చైర్మన్ నక్కా వీరభద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

**జెడ్.భావారంలో**

జెడ్.భావారం పీఏసీఎస్‌లో శుక్రవారం నిర్వహించిన మహాసభలో సీఈఓ ఆర్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 1540 మంది రైతులు సభ్యులుగా ఉండగా 1486 మంది పంటరుణాలు తీసుకుంటున్నారన్నారు. వీరికి స్వల్పకాలిక రుణాలుగా రూ.3.27 కోట్లు, దీర్ఘకాలిక రుణాలుగా రూ.1.56 కోట్లు, ఎస్‌టీ ఆదర్శ రుణాలుగా రూ.2.59 కోట్లు, డిపాజిట్లపై రూ.63.25 లక్షలు అందజేశామని, గతేడాదికి సొసైటీకి రూ.5.78 లక్షలు లాభాలు వచ్చాయన్నారు. పీఏసీఎస్ ప్రత్యేకాధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ జె.శివకామేశ్వరరావు పాల్గొన్నారు.

# పసి బిడ్డల రక్షణలో పదేళ్లు



జేసీ ఇలక్కియకు చెక్కును అందజేస్తున్న కోరమండల్ ఈడీ శంకర సుబ్రమణియన్



నూతన ఉపకరణాలను ప్రారంభిస్తున్న కోరమండల్ ఈడీ శంకర్ సుబ్రమణియన్

- కోరమండల్ ఈడీ శంకర్ సుబ్రమణియన్
- జీజీహెచ్ పీడియాట్రిక్ విభాగానికి రూ.22 లక్షల పరికరాల వితరణ

కాకినాడ క్రైం: జీజీహెచ్ చంటిపిల్లల విభాగంతో తమకు దశాబ్ద కాలంగా ప్రత్యేక అనుబంధం ఉందని, పసి బిడ్డల రక్షణలో తరిస్తున్నామని కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (న్యూట్రియంట్ బిజినెస్) శంకర్ సుబ్రమణియన్ అన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ఇప్పటికే అందిస్తున్న సహకారానికి అదనంగా మరో రూ.22 లక్షల విలువైన పరికరాలను జీజీహెచ్ పీడియాట్రిక్స్ విభాగానికి శుక్రవారం ఆయన అందజేశారు. చంటిపిల్లల వైద్య విభాగాధిపతి డాక్టర్ ఎంఎస్ రాజు ఆధ్వర్యాన పీడియాట్రిక్స్ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ పరికరాలను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతా దేవికి అందజేశారు. ఈ సందర్భంగా సుబ్రమణియన్ మాట్లాడుతూ, జీజీహెచ్ చంటిపిల్లల విభాగాన్ని కార్పొరేట్ స్థాయిని తలదన్నే రీతిలో తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో కాకినాడ జీజీహెచ్‌లోనే అత్యుత్తమ చంటిపిల్లల వైద్య విభాగం ఉందని అన్నారు. డాక్టర్ హేమలతాదేవి, రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరసింహం, హెచ్ఓడీ డాక్టర్ ఎంఎస్ రాజు మాట్లాడుతూ, కోరమండల్ సంస్థ తాజాగా రూ.22 లక్షల విలువైన బేబీ వార్మర్లు, ఫొటోథెరపీ యూనిట్లు, ఎయిర్ కంప్రెషర్లు, వ్యాక్యూమ్ పంపులతో పాటు పలు పరికరాలు సమకూర్చిందని వివరించారు. జీజీహెచ్‌లో శిశు మరణాల రేటు గణనీయంగా తగ్గిందని చెప్పారు. కార్యక్రమంలో జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ హరి విజయ్‌కుమార్, సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ పుష్కరరావు, డీసీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ అనిత, పీడియాట్రీషియన్లు డాక్టర్ విజయభాస్కర్, డాక్టర్ వెంకటేశ్వర్లు, వివిధ యూనిట్ల చంటిపిల్లల వైద్య నిపుణులు, సీపీఓ త్రినాథ్, కోరమండల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ అమీర్ అల్వీ, యూనిట్ హెడ్ సీహెచ్ శ్రీనివాసరావు, జీఎం (హెచ్‌ఆర్) పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

**రూ.30 లక్షలతో బీచ్‌రోడ్డు విద్యుదీకరణ**

కాకినాడ సిటీ: సామాజిక బాధ్యతలో భాగంగా బీచ్‌రోడ్డు విద్యుదీకరణ, వీధిలైట్లకు కోరమండల్ ఇంటర్నేషనల్ రూ.30 లక్షలను అందజేసింది. శుక్రవారం కలెక్టరేట్‌లో జేసీ ఇలక్కియను ఆ సంస్థ ఈడీ శంకర సుబ్రమణియన్ కలసి ఈ మొత్తాన్ని డీడీ రూపంలో అందజేశారు. అలాగే వాకలపూడి, వలసపాకల పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుకు సహకరిస్తామని, ప్రజా అవసరాల నిమిత్తం కమ్యూనిటీ భవనాల నిర్మాణం, ఆర్వో ప్లాంటు నిర్మాణ దశలో ఉన్నాయని, వాటిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని వివరించారు. కోరమాండల యూనిట్ హెడ్ సీహెచ్ శ్రీనివాసరావు, హెచ్ఆర్ జీఎం పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.